క్లుప్తంగా

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



తిమ్మాపురంలో అరటిచెట్లు, తోరణాలతో ముస్తాబైన పోలింగ్ కేంద్రం

మహానంది: బండిఆత్మకూరు మండలంలో పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపీడీఓ విజయరావు తెలిపారు. బండిఆత్మకూరు మండలంలోని బి.కోడూరు, వెంగళరెడ్డి పేట, సంతజూటూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు పూర్తి చేశామని, సిబ్బంది ఎవరికి కేటాయించిన విధుల్లో వారు ఉండాలన్నారు. మండలంలో 45 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 37,583 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మహానంది మండలంలో 37 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని మండల పరిషత్ అధికారులు తెలిపారు. మొత్తం 29,344 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



నందికుంట పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు, విద్యుత్ లైట్లను పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. ఆదివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో 37 పోలింగ్ కేంద్రాలకు గాను 37 మంది బీఎల్‌ఓలు ఉన్నారని ఇప్పటికే బీఎల్‌ఓలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం మంచినీరు, నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వికలాంగుల కోసం 19 వీల్ చైర్స్ అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల అధికారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

101 పోలింగ్ కేంద్రం వద్ద సైడ్ ఫ్రేమ్స్ ఏర్పాటు



పగిద్యాల 101 పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సైడ్ ఫ్రేమ్స్

పగిడ్యాల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో స్థానిక దేవనగర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (స్పెషల్)లో ఏర్పాటు చేసిన 101 పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బీఎల్‌ఓ ఉపేంద్రారెడ్డి సైడ్ ఫ్రేమ్స్ ఏర్పాటు చేశారు. గతంలో ఏ బీఎల్‌ఓ కూడా ఇలాంటి చర్యలు చేపట్టలేదు. అయితే ఈసారి పోలింగ్ స్టేషన్ వద్ద ఇరువైపుల సుమారు రూ. 5 వేలు ఖర్చు చేసి సైడ్ ఫ్రేమ్స్, నీడ వసతి కోసం రెండు షామియానాలు వేయించడం విశేషం. ఈ పోలింగ్ స్టేషన్‌లో 1203 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రలోభాలకు గురి చేస్తున్నారని టీడీపీ నాయకులపై ఫిర్యాదు



ఎస్‌ఐ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: టీడీపీ నాయకులు ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని, పక్కా ఆధారాలు ఉన్నాయని శ్రీశైలం న్యాయవాదులు సుధాకర్ రెడ్డి, బలరామ్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు పువ్వాడి భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎస్‌ఐ నారాయణరెడ్డిని కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే సదరు టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పకడ్బందీ పోలింగ్‌కు చర్యలు

మిడుతూరు: మండలంలోని 41 పోలింగ్ స్టేషన్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ గంగావతి ఆదివారం తెలిపారు. ఆదివారం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రానికి ఆరుగురు చొప్పున సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 10 పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టోరల్ ఆఫీసర్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సందేహాలు ఉంటే వారు నివృతి చేస్తారన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బందిని నియమించినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఓటేద్దాం రండి!

- నేడే సార్వత్రిక ఎన్నికల ఓటింగ్
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- 2, 18, 047 మంది ఓటర్లు, 251 పోలింగ్ కేంద్రాలు
- కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది... ఎన్నికల సామగ్రి

నందికొట్కూరు: 2024 సార్వత్రిక శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో కీలక ఘట్టమైన ఓటు వేసే సమయం ఆసన్నమైంది. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓటు వేసేందుకు అధికారులు ఒక రోజు ముందుగానే అన్నీ సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకున్న ఎన్నికల సిబ్బంది రాత్రే వారికి కేటాయించిన వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రా (ఆ గ్రామంలో)ల్లోనే రాత్రికి బస చేసి ఉదయం నుంచి ఎన్నికల విధుల్లో పాల్గొనున్నారు. ఇందుకు పీఓ, ఏపీఓ, ఓపీఓ, ఎంఓలుగా నియామకమైన వారికి ముందు నుంచే ఎన్నికల విధులకు సంబంధించిన డ్యూటీ ఆర్డర్ కాపీలు ఇచ్చేశారు. పోలింగ్ రోజు ఉదయం 6 గంటలకు రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. మాక్ పోలింగ్ వివరాలను రికార్డులో నమోదు చేసి సాయంత్రం వరకు జిల్లా ఎన్నికల అధికారికి అందజేయనున్నారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభించి సాయంత్రం వరకు కొనసాగిస్తారు. ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఇది వరకే చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాలకు గాను 20 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని ప్రత్యక్షంగా వీక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



వీవీప్యాట్‌లు, ఈవీఎంలు తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ అధికారులు, సిబ్బంది



పోలింగ్ సామగ్రి సరి చూసుకుంటున్న సిబ్బంది



పోలీసుల సమక్షంలో ఈవీఎంలను తరలిస్తున్న దృశ్యం



ఎన్నికల బందోబస్తు కోసం వెళ్తున్న పోలీసులు

పోలింగ్ కేంద్రాలు–251

నియోజకవర్గంలో 2,18,047 ఓటర్లు ఉన్నారు. 1,06,689 మంది పురుషులు ఉండగా, 1,11,340 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు 18 మంది ఉన్నారు. 251 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓటు వేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, తదితర సౌకర్యాలు కల్పించి పోలింగ్‌కు సిద్ధం చేశారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 25 రూట్లను తయారు చేసి సిద్ధంగా ఉంచారు. మొత్తం 36 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సాధరణ పోలింగ్ కేంద్రానికి నియమించే పోలీసు బలగాలతో పాటు మరి కొంతమంది అదనపు బలగాలతో భద్రత కల్పించారు. అలాగే వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు.

1,899 మంది సిబ్బంది

వంద శాతం పోలింగ్ నమోదు చేయడమే లక్ష్యంగా ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలతో పాటు ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, సిబ్బందిని అంతా రెడీ చేసి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్ సిబ్బంది 1,899 మంది విధులు నిర్వర్తించనున్నారు. ఆదివారం ఉదయం నుంచి పోలింగ్ సిబ్బందికి సామగ్రి అందజేశారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సీయూలు, బీయూలు, వీవీప్యాట్‌లు తీసుకున్ని వెళ్లారు.

నిర్భయంగా ఓటు వేయాలి

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసు కోరారు. నిర్భయంగా ముందుకు వచ్చి ఓటు వేయాలని, వచ్చేటప్పుడు ఓటర్ స్లిప్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. పోలింగ్ స్టేషన్ వద్ద సాయంత్రం 5 గంటలలోపు క్యూలైన్‌లో నిలిచిన వారికి ఓటు వేసే అవకాశం ఉంటుందని చెప్పారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సమస్యాత్మక గ్రామాల్లో భారీ బందోబస్తు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది



సిబ్బందికి విధులు కేటాయిస్తున్న అధికారులు



పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్వో సుధారాణి



పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో సోమవారం జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు పోలింగ్ నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, శ్రీశైలం, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లోని 266 పోలింగ్ కేంద్రాల్లో పీఓ, అడిషనల్ పీఓ, ఇతర సిబ్బంది 6 నుంచి 10 మందికి పైగా నియమించారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు దాదాపు 4 వేలకు పైగా పోలింగ్ సిబ్బందిని నియమించారు. శ్రీశైలం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో 33 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. ఇందులో ఆత్మకూరు మండలంలోని పెద్దచెరువు, ఆత్మకూరు పట్టణంలోని ఎంపీపీ తోటగిరి 62, 63 పోలింగ్ కేంద్రాలు, బాలికల పాఠశాల 64 నుంచి 66 పోలింగ్ కేంద్రాలు, అలాగే 73 పోలింగ్ కేంద్రం, నల్లకాలువ, కరివేన, వెలుగోడు మండలంలో జెడ్పీహైస్కూల్‌లోని 110 నుంచి 114 పోలింగ్ కేంద్రాల వరకు, 124 రేగడగూడూరు పోలింగ్ కేంద్రం, 139 నుంచి 142 పోలింగ్ కేంద్రాలైన వేల్పనూరు, బండిఆత్మకూరు పట్టణం, జీసీపాలెం, సింగవరం, వెంగళరెడ్డిపేట, మహానంది మండలం బుక్కాపురం, మసీదుపురం, సీతారామపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించినట్లు ఆర్వో సుధారాణి తెలిపారు. ఇప్పటికే ఆమె పోలింగ్ సిబ్బందికి ఈవీఎం మిషన్లకు సంబంధించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది సిరా చుక్క ఎలా వేయాలి, మిషన్ పనితీరు, తదితర వాటిపై వివరించారు. అనంతరం సిబ్బంది పోలింగ్ సామగ్రిని తీసుకుని వాహనాల్లో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు.

ప్రశాంత ఓటింగ్‌కు సహకరించాలి

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఆర్వో సుధారాణి కోరారు. ఆమె మాట్లాడుతూ.. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆత్మకూరు సీఐలు నాగభూషణం, లక్ష్మీనారాయణలతో పాటు బీఎస్‌ఎఫ్‌తో పాటు స్థానిక పోలీసులు, స్పెషల్ పార్టీ, హోంగార్డు, వివిధ శాఖల అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులపై మండిపడడం లాంటి సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏవైనా మిషన్లకు సంబంధించినవి కానీ, ఇతర సమస్యలు తలెత్తితే ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని పోలింగ్ సిబ్బందికి సూచించారు.

పోలింగ్‌బూత్‌ల తనిఖీ

పాములపాడు: మండలంలోని బానకచెర్ల, వేంపెంట, వానాల, మిట్టకందాల, రుద్రవరం గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ బూత్‌లను ఎంపీడీఓ సరస్వతి తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 33,913 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 16,733 మంది, మహిళలు 17,178 మంది, ట్రాన్స్‌జెండర్లు 2 చొప్పున ఉన్నారన్నారు. పోలింగ్‌కు సంబంధించి మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 40 పోలింగ్‌భూతులను ఏర్పాటు చేశామని, ప్రతి పోలింగ్‌భూతుకు పీఓ1, ఏపీఓ1, ఓపీఓలు 3 చొప్పున 5 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. మొత్తం 200 మంది ఎన్నికల సిబ్బంది విధులకు హాజరవుతాయని చెప్పారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూలు వద్ద పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఓటర్లను ఆకర్శించేలా ఏర్పాటు చేశారు.



పాములపాడులో మోడల్ పోలింగ్ బూత్

మంచి చేసే నాయకులను ఎన్నుకోండి



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: ఎన్నికల్లో మంచిచేసే నాయకులను ఎన్నుకోవాలని శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తును మార్చే ఎన్నికలు కావునా ప్రతి ఒక్కరు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. వంద శాతం పోలింగ్ నమోదు చేయాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని జూపాడు బంగ్లా ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అధ్వర్యంలో సీఐ, ఎస్‌ఐలతో పాటు ఏఎస్‌ఐ, హెచ్‌సీ, పీసీలు కలిపి 56 మంది మండలంలోని 33 పోలింగ్ బూతుల వద్ద బందోబస్తు నిర్వహిస్తారన్నారు. అలాగే 8 మంది బీఎస్‌ఎఫ్, మరో 8 మంది ఆర్పీఎస్‌ఎఫ్ బలగాలు నిరంతరం మొబైల్ వాహనాల్లో పర్యవేక్షిస్తారన్నారు. పోలింగ్ సందర్భంగా ఎవరైనా గ్రామాల్లో అల్లర్లు సృష్టించినా, తగాదాలు, ఘర్షణలకు పాల్పడినా కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్‌తో పాటు పోలీసుయాక్టు 30 అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో గుంపులు గుంపులుగా ఉండటం, ఒకరిద్దరు కలిసి ఉండటం చట్టరీత్యానేరమన్నారు. అలాగే పోలింగ్‌బూత్‌లో ఓటువేసిన వ్యక్తి ఎక్కడా నిల్చోకుండా నేరుగా ఇళ్లకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు వందమీటర్ల దూరం వరకు ఓటర్లు మినహా అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించరాదని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం

మహానంది: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా ఆదివారం రాత్రి బొల్లవరం గ్రామంలో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండొద్దన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం చేస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా శంకర జయంతి



ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు, ఈఓ దంపతులు

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలధార పంచధార వద్ద ఉన్న ఆదిశంకరాచార్యుల ఆలయంలో ఆయన జయంతోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆది శంకరాచార్యుల వారికి, చంద్రమౌళీశ్వరస్వామికి జలాభిషేకం, పంచామృతాభిషేకం షోడశోపచార పూజలు వేదమంత్రోచ్చారణలతో నిర్వహించారు. ఈఓ పెద్దిరాజు దంపతులు అర్చకస్వాములు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెట్టు విలువ!



చెట్టు కింద సేదతీరుతున్న మేకలు, పొట్టేళ్లు

మహానంది: మండుతున్న ఎండలకు జనం అల్లాడుతున్నారు. చెట్లను ఇష్టానుసారం నరికివేడంతో పర్యావరణం దెబ్బతినడంతో వేసవితాపం ఎక్కువైంది. పొలాల్లో మేతకు వెళ్లిన గొర్రెల మంద ఎండలకు తట్టుకోలేక గుంపుగా ఓ చెట్టు కింద సేదతీరుతున్న దృశ్యం చెట్టు విలువను చెప్పకనే చెబుతుంది. మహానంది సమీపంలో దృశ్యం కనిపించింది.

ఆదర్శ పోలింగ్ కేంద్రం



రంగు రంగుల బెలూన్లతో సుందరంగా తీర్చిదిద్దిన ఇస్లాంపేట మోడల్ పోలింగ్ కేంద్రం

ఆత్మకూరు: పట్టణంలోని ఇస్లాంపేట పోలింగ్ కేంద్రం ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఎన్నికల అధికారులు తీర్చిదిద్దారు. సోమవారం జరిగే పోలింగ్ కార్యక్రమంలో ఈ కేంద్రం ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నది. పోలింగ్ కేంద్రం ముందుగా భాగంలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి బోర్డును పూలతో అలంకరించారు. లోపలి వైపు కుర్చీలు వేసి సుందరంగా అలంకరించారు. ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారిణి సుధారాణి సూచించారు.

నాడు-నేడు.. బడి మారింది చూడు!

నందికొట్కూరు: నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు ఒకప్పుడు చాలా అధ్వాన్నంగా ఉండేవి. గతంలోని తెలుగు దేశం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బడిలో సదుపాయాలు అరకొరగా మాత్రమే ఉండేవి. శిథిలమైన పాఠశాలలో చాలీచాలని తరగతి గదులు, పెచ్చులూడిన గచ్చులు, సరైన తలుపులు కూడా లేని మరుగుదొడ్లు, అంతంతమాత్రంగానే తాగునీటి సదుపాయం, పాఠశాలల ఆవరణ అంత గోతులమయంగా ఉండే పరిస్థితులు కనిపించేవి. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విద్యార్థులకు విద్యా అసలైన ఆస్తి భావించింది. మనబడి నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టి, ప్రభుత్వ బడుల రూపురేఖలను సమూలంగా మార్చేసింది. ఈ క్రమంలో ఇక్కడి పాఠశాలలు సరికొత్త సొబగులు అద్దుకున్నాయి. నియోజకవర్గంలో తొలి విడతలో మంజూరైన-121 ప్రభుత్వ పాఠశాలలను రూ, 18. 03 కోట్ల నిధులతో, రెండోవ విడతలో మంజూరైన-138 ప్రభుత్వ పాఠశాలలను రూ, 46.56 కోట్లతో అత్యంత సుదరంగా తీర్చిదిద్దారు. పాఠశాలల ఆవరణ సైతం హ్లాదకరంగా మార్చారు. విశాలమైన ఆటస్థలం, మరుగుదొడ్లు, అన్ని తరగతి గదుల్లో ఇంటర్నెట్ అనుసంధానంతో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, కొత్త బెంచీలు ఏర్పాటు చేశారు. అలాగే ఇంగ్లిషు మీడియం విద్యతో పాటు స్మార్ట్ క్లాసులు నిర్వహిస్తున్నారు. 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులు అందజేశారు. ప్రస్తుతం పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా కనిపిస్తుండడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గువ్వలకుంట్ల ఎంపీయూపీ స్కూల్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డు ద్వారా బోధన



నందికొట్కూరు మండలంలోని కొణిదేల జెడ్పీ హైస్కూల్ ఆవరణ



కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల పాఠశాలలో గోడలపై గీసిన బొమ్మలను తిలకిస్తున్న విద్యార్థులు



నందికొట్కూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, సింక్‌లు



నాడు-నేడు నిధులతో తీర్చిదిద్దిన మిడుతూరు మండలం చింతలపల్లి ప్రాథమిక పాఠశాల